# డ్రైనేజీలోని చెత్త తొలగింపు



డ్రైనేజీలో తొలగించిన చెత్త

నమస్తే ఎఫెక్ట్

నిర్మల్‌లోని డాక్టర్స్‌లైన్ డ్రైనేజీ కాలువలో నిలిచిన మురుగునీరు ఈ నెల 5వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. గురువారం డ్రైనేజీలోని చెత్తను జేసీబీతో తొలగించారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్ స్వయంగా పర్యవేక్షించి శుభ్రం చేయించారు.

- నిర్మల్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 6

# తీన్మార్ మల్లన్న శవయాత్ర



తీన్మార్ మల్లన్న శవయాత్ర నిర్వహిస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

బోథ్, ఫిబ్రవరి 6 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ(బీ) గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఇటీవల తీన్మార్ మల్లన్న వరంగల్‌లో జరిగిన బీసీ బహిరంగ సభలో పాల్గొని రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య వేదిక యువత విభాగం సంయుక్త కార్యదర్శి ఇట్టెడి సాయికిరణ్ రెడ్డి, ముడుపు సతీశ్ రెడ్డి, చిలుకూరి అనిల్ రెడ్డి, ఇట్టెడి సాయికృష్ణ రెడ్డి, బద్దం రాకేశ్ రెడ్డి, సాయి సుకేశ్, అశోక్ రెడ్డి, చందర్ రెడ్డి, మురళీ మనోహర్ రెడ్డి, రాంచందర్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు.


## సొనాలలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం



సొనాలలో తహసీల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆదిలబాద్ కలెక్టర్ రాజర్షి షా

బోథ్, ఫిబ్రవరి 6: ఆదిలబాద్ జిల్లా సొనాలలోని ప్రభుత్వ కార్యాలయాలను గురువారం కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. మండల పరిషత్, తహసీల్ కార్యాలయాలను ప్రారంభించారు. తహసీల్దార్‌గా మల్లేశ్, ఎంపీడీవోగా దుర్గం రాజేశ్వర్ కార్యాలయాల్లోని సీట్లలో కలెక్టర్ కూర్చోబెట్టి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా పరిషత్ సీఈవో జితేందర్ రెడ్డి, ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్ కుమార్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మంచికంటి లక్ష్మణ్

పెంబి, ఫిబ్రవరి 6: బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 9వ తేదీన హన్మకొండలో నిర్వహించనున్న ఏఐసీటీయూ రాష్ట్ర ప్రథమ మహాసభ సందర్భంగా గురువారం పెంబిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు ఆసరా పింఛన్ రూ. 4 వేలకు పెంచాలని, డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని, కనీస వేతనాల జీవోను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేశవులు, హరికృష్ణ పాల్గొన్నారు.

## బీసీలకు తీరని నష్టం

భైంసా, ఫిబ్రవరి, 6 : తాజా కులగణనతో తీసుకువచ్చే రిజర్వేషన్లు బీసీ కులాలకు తీరని నష్టాన్ని తెచ్చి పెట్టేలా ఉన్నాయని బీసీ సంఘం నాయకులు అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా భైంసాలో ఆర్డీవో కోమల్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కుల గణన అనేది రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకంగా జరగలేదన్నారు. ఇందులో బీసీల జనాభాను తక్కువగా చూపి ఓసీల జనాభాను ఎక్కువ చూపడం అంటే బీసీలకు అన్యాయం చేయడమే అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి, మల్లేశ్, శ్రీనివాస్, ప్రకాశ్, గాలి రాజు, రావుల పోశెట్టి ఉన్నారు.



భైంసా: ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

## నగదు పట్టివేత

తానూర్, ఫిబ్రవరి 6 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు విస్తృతం చేశారు, ఇందులో భాగంగా గురువారం తానూర్ మండలంలోని బెల్తరోడ చెక్ పోస్టువద్ద రూ .లక్ష 33 వేల పట్టుకున్నారు.చెక్‌పోస్టు వద్ద రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నర్సింహులు వద్ద ఈ డబ్బును పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.




ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

# సమయపాలన పాటించని అధికారులు

*నిర్మల్ జిల్లా భైంసా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఉదయం 10.50 గంటలకు కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ఒక్కరే కనిపించారు. ఎంపీవో, పీఆర్ ఏఈ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, ఉపాధి హామీ ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది కనిపించలేదు. దీంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వివిధ అవసరాల కోసం వచ్చిన ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతస్థాయి అధికారులు కల్పించుకుని అధికారులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.*

-భైంసాటౌన్, ఫిబ్రవరి 6

# కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- జామ్ బాలికల గురుకుల విద్యాలయం తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగాపూర్, ఫిబ్రవరి 6: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం రాత్రి నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళిక ప్రకారం చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థినులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థినులు, అధికారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థినులతో ముచ్చటిస్తూ వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఏమైన సమస్యలు ఉంటే వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వంటగది, స్టోర్‌రూమ్, మరుగుదొడ్లు, రీడింగ్‌రూమ్, విద్యార్థినుల వసతి గదులను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థినులతో కలిసి అక్కడే బస చేశారు. ఆమె వెంట డీఈవో రామారావు, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో మధుసూదన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, ప్రిన్సిపాల్ సంగీత, సిబ్బంది ఉన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి




మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 6: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కేశవపట్నంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నర్సాపూర్(టీ) ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి తనిఖీ చేశారు. తేమడ పరీక్షలు నిర్వహించారు. ఎక్సరే 12 రిమ్స్‌లో ఆదిలాబాద్‌కు పంపడం 26 మంది శాంపిల్ తీయడం జరిగిందన్నారు. బీపీ, షుగర్ ఆన్‌లైన్ ఎంతమందికి చేశారో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట వైద్యులు హిమబిందు, నరేశ్, ఫార్మాసిస్టు అరుణ్, హెచ్‌ఈవో గణేశ్, హెల్త్ అసిస్టెంట్ అర్జున్ పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

సోన్, ఫిబ్రవరి 6: పదో తరగతి విద్యార్థులు చదువుపై దృష్టి సారించి బాగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని నిర్మల్ డీఈవో రామారావు సూచించారు. గురువారం నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని జాఫ్రాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. ప్రతిరోజూ విద్యార్థులు తరగతులకు హాజరై బాగా చదువుకోవాలని సూచించారు. అవసరమైన విషయాల్లో సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు స్లిప్ పరీక్షలు రాయాలని తెలిపారు. ఆయన వెంట అకాడమిక్ సమన్వయకర్త నర్సయ్య, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## పంట వివరాలు నమోదు చేసుకోవాలి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 6: రైతులు యాసంగిలో సాగు చేసే పంటల వివరాలు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఈ యాసంగిలో వివిధ రకాల పంటలైన మొక్కజొన్న, వరి, ఇతర పంటల వివరాలు తమ పరిధిలోని రైతు వేదికల్లో ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని, రైతులు తమ పంట పాస్‌బుక్ నంబర్‌తో పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 6 : చెరువులోకి దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిర్మల్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిర్మల్‌లోని కూరన్నపేటకు చెందిన దాసరి భూమన్న(65) అతిగా మద్యం తాగుతుండేవాడు. కుమారులు మద్యం తాగడం మానివేయాలని సూచించారు. సోమవారం భూమన్న కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో పెద్ద కుమారుడు రమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో గురువారం స్థానిక బంగల్‌పేట చెరువులో మృతదేహం కనబడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ మృతదేహాన్ని పరిశీలించి దాసరి భూమన్నగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

తాంసి(భీంపూర్), ఫిబ్రవరి 6: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం ధనోర గ్రామంలోని రైతు మట్ట కిరణ్ యాదవ్‌కు చెందిన ఎద్దు వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి గురువారం మృతి చెందింది. దేవగిరి జాతికి చెందిన ఈ ఎద్దును హర్యానా నుంచి గతేడాది రూ.90 వేలకు కొనుగోలు చేసినట్లు రైతు కిరణ్ తెలిపారు. విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందినట్లు జేఎల్ఎం దినేశ్ ధ్రువీకరించారు.

## ద్విచక్రవాహనానికి మంటలు

ఎదులాపురం, ఫిబ్రవరి 6 : ఆదిలాబాద్‌లోని ఈద్గా మైదానం సమీపంలో గల వెల్డింగ్ దుకాణం వద్ద గురువారం రాత్రి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనానికి మంటలు అంటుకున్న ఘటన చోటు చేసుకుంది. క్రాంతినగర్‌కు చెందిన వాజీద్ ద్విచక్రవాహనం స్టాండ్‌కు వెల్డింగ్ చేసే టప్పుడు పెట్రోల్ పైపు లీకై మంటలు అంటుకున్నాయి. స్పందించిన స్థానికులు వెంటనే మంటలర్పివేయడంతో భారీ నష్టం తప్పింది.

## మొరం టిప్పర్లు పట్టివేత

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 6: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా తలిస్తున్న రెండు మొరం టిప్పర్లు పట్టుకున్నట్లు తహసీల్దార్ సుజాత రెడ్డి తెలిపారు. పట్టుకున్న మొరం టిప్పర్లను సీజ్ చేసి తహసీల్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బొలెరో వాహనం ఢీ: ముగ్గురికి గాయాలు

ఎదులాపురం, ఫిబ్రవరి 6 : ఆదిలాబాద్‌లోని అంకోలి రోడ్డు పక్కన ద్విచక్రవాహనాలు ఆపి నిలబడి మాట్లాడుకుంటున్న వారిని గురువారం రాత్రి బొలెరో వాహనం ఢీ కొనడంతో ముగ్గురు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకోలి వైపు వెళ్తున్న బొలెరో ముందు వెళ్తున్న కారును ఢీ కొనడంతో పాటు రోడ్డు పక్కన నిలబడి ఉన్న వారిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో భీంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గణేశ్, ఆదిలాబాద్‌కు చెందిన వెంకట్ రెడ్డి, నితిన్‌కు గాయాలయ్యాయి. 108 ఈఎంటీ రవికుమార్ ప్రథమ చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు. ప్రమాద ఘటన విషయమై వన్ టౌన్ పోలీసులు ప్రాథమిక విచారణ జరుపుతున్నారు.

## స్టాంపుల సేకరణ అలవాటు చేసుకోవాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 6: విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉంటూ స్టాంపుల సేకరణను అలవాటు మార్చుకుంటే దేశ చరిత్ర, విశేషాల గురించి జ్ఞానం పెంపొందుతుందని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ అన్నారు. గురువారం ఆదిలాబాద్ డివిజన్ తపాలా శాఖ ఆధ్వర్యంలో స్థానిక లిటిల్ ఫ్లవర్ ఆడిటోరియంలో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఫిలాటికల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. పురాతన కాలం నుంచి ఇప్పటి వరకు ఉన్న ఉత్తరాలు, నాణేలు, స్టాంపులు ప్రదర్శించారు. గతేడాది మే 29న జిల్లా స్థాయిలో నిర్వహించిన దీన్ దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన 58 మంది విద్యార్థులకు మెమెంటోలు, 8 పాఠశాలల నుంచి ఎంపికైన 14 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్ పాటస్కర్, పోస్టల్ ఏఎస్పీ లవకుశ్ పార్టే, ఐపీ కిరణ్, అధికారులు గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువకుడి అరెస్ట్

ఎదులాపురం, ఫిబ్రవరి 6: ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన మాదాసు మహేందర్ తన తల్లి విజయలక్ష్మితో కలిసి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించడానికి వెళ్లారు. మూడో అంతస్తు నుంచి కిందికి దిగేటప్పుడు ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంట గ్రామానికి చెందిన ముండె శ్రీకాంత్ రెండో అంతస్తు వద్ద పైకి ఎక్కుతున్న క్రమంలో విజయలక్ష్మి మెడలోని బంగారు పుస్తెల తాడు లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో విజయలక్ష్మి పుస్తెలతాడును గట్టిగా పట్టుకొగా ఆమె కుమారుడు మాదాసు మహేందర్ కేకలు వేశాడు. ఈ క్రమంలో దుండగుడు పరారయ్యే ప్రయత్నం చేయగా సెక్యూరిటీ సిబ్బంది నరేశ్, చందు, అంకుష్, అమీర్, హన్మాండ్లు పట్టుకొని రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. తక్షణమే స్పందించి దుండగుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన సెక్యూరిటీ సిబ్బందిని డీఎస్పీ జీవన్ రెడ్డి అభినందించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

కుభీర్, ఫిబ్రవరి 6: నిర్మల్ జిల్లా కుభీర్, నిగ్వ, పల్సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని, తల్లిదండ్రులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన బోధనను అందుకోవాలని అధ్యాపకులు సూచించారు. గురువారం మండలంలోని ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కళాశాలలో బోధన, ఇతర వసతులు, చేరడం వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కంద్రాతి సంపత్ కుమార్, లింగయ్య, భాస్కర్, నర్సయ్య, శివరాజ్, హన్మంత్‌రావ్, శ్రీనివాసరావ్ పాల్గొన్నారు.

## నరేశ్ కుమార్ జోషికి సన్మానం

ఎదులాపురం, ఫిబ్రవరి 6: ఇటీవల జరిగిన ఆదిలాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన నరేశ్ కుమార్ జోషిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్‌రావు, బార్ అసోసియేషన్ సంయుక్తంగా గురువారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భారత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండ్రాల నగేశ్, ప్రభుత్వ న్యాయవాది దయాకర్, న్యాయవాదులు, డీఎస్పీ శర్మ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



పొన్నారి అంతర్రాష్ట్ర రహదారిని పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ

తాంసి, ఫిబ్రవరి 6 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి, హస్నాపూర్ అంతర్రాష్ట్ర రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాల నివారణకు పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం ప్రమాద స్థలాలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ప్రమాద ప్రాంతాలైన గ్రామాల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయడంతో పాటు తదితర చర్యలు తీసుకోవడానికి నిర్ణయించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఇక్కడ ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్, ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్, తాంసి ఎస్ఐ రాధిక, మాజీ సర్పంచ్ నర్సింగ్, గ్రామస్తులు ఉన్నారు.

## డయాగ్నొస్టిక్ సెంటర్ సీజ్

ఇచ్చోడ, ఫిబ్రవరి 6 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో అనుమతులు, సర్టిఫికెట్ లేకుండా నిర్వహిస్తున్న సుమిత్ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను గురువారం సీజ్ చేశామని జిల్లా మాస్ మీడియా అధికారి రవిశంకర్ తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా డయాగ్నొస్టిక్ కేంద్రాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లోకేశ్వరం, ఫిబ్రవరి 6 : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని రాజురా మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అలాగే పుస్పూర్ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయరెడ్డి హైదరాబాద్‌లో ఆపరేషన్ చేయించుకొని ఇటీవల ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ ముథోల్ నియోకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు లోలం శ్యాంసుందర్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భోజన్న, యువ నాయకులు అనిల్, సుధాకర్ ఉన్నారు.

## విద్యార్థులకు సేవలు అందించాలి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మంచి సేవలు అందించాలని ఎంఈవో మనుకుమార్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో అప్‌డేట్ చేస్తున్న ఆధార్‌కార్డులతో పాటు విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

## సహకార బ్యాంకు నిర్మాణ స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సొసైటీ అధికారులు

బోథ్, ఫిబ్రవరి 6: ఆదిలాబాద్ జిల్లా సొనాలలోని సహకార బ్యాంకు నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని గురువారం ఏజీఎం అభయ్‌కుమార్ పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సీఈవో గోలి స్వామి, సొనాల బ్యాంక్ మేనేజర్ జాప పోశెట్టి, ఫీల్డ్ అసిస్టెంట్ పాపన్న, సొసైటీ డైరెక్టర్లు లోలపు పోశెట్టి, రాజు యాదవ్, రాందాస్, రోహిదాస్, సత్యనారాయణ ఉన్నారు.

## పసుపు రైతులకు అండగా ఐటీసీ కంపెనీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఐటీసీ కంపెనీ ప్రతినిధులు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 6: పసుపు రైతులకు ఐటీసీ కంపెనీ అండగా ఉంటుందని ఐటీసీ కంపెనీ డివిజనల్ ఆఫీసర్ వెంకట్‌గాంధీ పేర్కొన్నారు. గురువారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం పీచర గ్రామంలో పసుపు సాగు చేస్తున్న రైతులకు పసుపు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వసంత్‌రావ్, ఏఈవో సుస్మిత, ఐటీసీ సిబ్బంది నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

బోథ్, ఫిబ్రవరి 6: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో సీఐ వెంకటేశ్వర్ రావ్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, జీపులను ఆపి పత్రాలు పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా తదితర వాటిని పరిశీలించారు. లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అన్ని రకాల పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. తనిఖీలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 6: గిరిజనులు, పేదలకు తునికాకు సేకరణ ఉపాధి కల్పిస్తున్నదని, తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏటా డిసెంబర్, జనవరి నుంచే సేకరణ ప్రక్రియకు సంబంధించిన పనులను అటవీ శాఖ మొదలు పెట్టేదన్నారు. ఈ ఏడాది మాత్రం ఆ ప్రక్రియ నత్తనడకను తలపిస్తుందన్నారు. టెండర్లను ప్రూనింగ్ ప్రక్రియను సకాలంలో చేపట్టకుంటే లక్షలాది మంది పేదల ఉపాధికి గండిపడే అవకాశం ఉందన్నారు.